క్లుప్తంగా

నిత్యావసరాలు అందజేత



నకరికల్లు: పేదలకు అండగా నిలిచేందుకు యూనియన్ తరఫున సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు గుండ్లపల్లి ఎంప్లాయిస్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన నకరికంటి శిలార్ అనారోగ్యంతో మృతి చెందగా అతని భార్య రంజాన్బీ, వారి ముగ్గురు ఆడపిల్లలు ఆర్థిక బాధలతో కుటుంబం వెళ్లదీస్తుండగా యూనియన్ తరఫున బియ్యం, నిత్యావసరాలు, ఆర్థిక సహాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో సభ్యులు గండు మస్తాన్వలి, సయ్యద్ మునీర్, కూరపాటి సైదావలి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



బెల్లంకొండ: బెల్లంకొండ రైల్వే స్టేషన్లో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉండటాన్ని గురువారం రాత్రి స్థానికులు గుర్తించారు. ప్లాట్ ఫాం మీద పడుకొని అనారోగ్య కారణంగా చనిపోయి ఉంటాడని గుర్తించి, విషయాన్ని రైల్వే అధికారులకు తెలియజేశారు. నడికుడి రైల్వే ఎస్సై శ్రీనివాసరావు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడి వయసు సుమారు 35 సంవత్సరాలు వరకు ఉంటుందన్నారు. తెలుపు రంగు పైన కాఫీ కలర్ పూలు కలిగిన చొక్కా, కాఫీ కలర్ ప్యాంట్ ధరించి, అరచేతిలో గోరింటాకు పెట్టుకుని ఉన్నట్లు చెప్పారు. మృతుని కుడి కాలికి వేళ్లు లేవని, మెడలో నలుపు రంగు పూసల దండ ధరించినట్లు తెలిపారు. మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మృతుని వివరాలను 9440438256 నంబర్కు తెలియజేయాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి



బెల్లంకొండ: పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి జరిపి, పేకాడుతున్న నలుగురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై డి.ప్రవీణ్ తెలిపారు. మండలంలోని న్యూ చిట్యాల గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు చేసినట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న రూ.11,200 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. ఎస్సై వెంట సిబ్బంది షణ్ముఖరావు, మల్లికార్జునరావు, రాజేష్ ఉన్నారు.

ఏరియా వైద్యశాల వద్ద అన్న సంతర్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో నిరుపేద రోగులు, వారి సహాయకులకు జనసేన నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాల ఉద్యోగి కె.సునీత, రాజేష్ నాయక్ కుమారుడు కర్ణి స్వరూప్ జన్మదినం సందర్భంగా శుక్రవారం 120 మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పాపురపు నరేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో ఉద్యోగులు తమ విధులు నిర్వహిస్తూనే స్వచ్ఛందంగా అన్నప్రసాద వితరణ పథకం కొనసాగించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల వైద్యులు డాక్టర్ ప్రవీణ్, ఆర్యవైశ్య నాయకులు పోతుగంటి రామకోటేశ్వరరావు, నరసింహారావు, కట్టమూరు అప్పారావు, కూరపాటి విజయ శంకర్, సూరే కోటేశ్వరరావు, నాళం భాస్కర్ తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

మాచర్ల: దేశవ్యాప్తంగా న్యాయవాదుల బాధ్యతలు తగ్గించి, విధి విధానాలకు ఇబ్బంది కలిగించేలా అడ్వకేట్ ప్రాక్టీస్ పై తీసుకొస్తున్న సవరణ చట్టాన్ని నిరసనగా రాష్ట్ర బార్ కౌన్సిల్ పిలుపు మేరకు రెండవ రోజు శుక్రవారం పట్టణంలోని సివిల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులంతా విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఉదయం విధులకు హాజరైన వారు కోర్టు జడ్జిలు శ్రీరాం, శ్రీనివాస్ కల్యాణ్, పి.ప్రకాశ్ లకు వినతిని తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సంఘ నాయకులు మాట్లాడుతూ న్యాయవాదుల విధుల సవరణ చట్టం తమ బాధ్యతల విషయంలో ఆటంకమన్నారు. న్యాయవాదులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు.

పంట మార్పు.. లాభాలు పొందు

- రైతులకు ఊరటనిస్తున్న పొగాకు
- రబీలో పత్తి, మిర్చికి ప్రత్యామ్నాయంగా
- ప్రభుత్వంపై ఆధారపడకుండా ఐటీసీ ప్రతినిధులతో ఒప్పందం

అచ్చంపేట: భారీ పెట్టుబడులు పెట్టి పత్తి, మిర్చి పంటలు వేసిన రైతులకు ఈ ఏడాది భారీగా నష్టం వాటిల్లింది. ప్రారంభంలో భారీ వర్షాలకు పత్తికి నష్టం వాటిల్లగా తెగుళ్లు సోకి మిర్చి దిగుబడి గణనీయంగా తగ్గింది. వేసిన పంటలకు మద్దతు ధరలు ప్రకటించడంలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గత ఏడాది ఇదే కాలంలో క్వింటా మిర్చి రూ.22 వేలు ఉండగా, ఈ ఏడాది కనీసం రూ.10 నుంచి 12 వేలకు మించి లేదు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడిగా ఇస్తామన్న రూ.20 వేల హామీని ప్రభుత్వం తుంగలో తొక్కడంతో దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్న రైతన్నలకు పొగాకు పంట ఊరటనిచ్చింది. ప్రభుత్వాన్ని నమ్ముకోకుండా రైతులు ప్రత్యామ్నాయంగా పొగాకు పంట వైపు దృష్టి మరల్చారు. ఈ ఏడాది మండలంలో వెయ్యి ఎకరాలకు పైగా పొగాకు పంట వేశారు. కొంత మంది రైతులు రబీ పంటగా వేస్తే, మరి కొంత మంది మిర్చికి ధర లేకపోవడంతో, పెట్టుబడులు పెట్టలేక, ధర పలుకుతుందన్న నమ్మకం లేక మిర్చి పీకేసి పొగాకు వేస్తున్నారు.

ఐటీసీతో ఒప్పందం

పొగాకు పంట వేసే ముందే ఐటీసీ (ఇండియన్ టుబాకో కంపెనీ) సంస్థతో రైతులు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. వేసే నారు నుంచి మార్కెటింగ్ వరకు ఐటీసీ సంస్థ సూచనలను పాటిస్తున్నారు. పంట వేసిన రైతులకు భారీగా లాభాలు రాకపోయినా నష్టాల బారిన పడకుండా ఉండేందుకు ఇదో ప్రత్యామ్నాయ పంటగా భావిస్తున్నారు.



కోగంటివారిపాలెంలో వేసిన పొగాకు పంట

మూడు నెలల్లో పంట

మూడు నెలల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు పెట్టుబడి సుమారు రూ.50 వేల వరకు అవుతుంది. నారు వేసే నాటి నుంచి మార్కెటింగ్ వరకు ఇండియన్ టుబాకో కంపెనీ వారి సూచనలు పాటిస్తే నష్టపోయే ప్రసక్తి లేదని రైతులు నమ్ముతున్నారు. పొగాకు పంట బెట్టకు వచ్చినా తట్టుకునే పరిస్థితులున్నట్లు రైతులే చెబుతున్నారు.

ఖర్చు ఇలా...

ఒక ఎకరాలో పొగాకు పంట వేయాలంటే అరకలు దున్నినందుకు రూ.5 వేలు, నారు వెయ్యి మొక్కలు రూ.400 చొప్పున ఎకరానికి 4 వేల మొక్కలకు రూ.4 వేలు, మొక్కలను చిలకలూరిపేట నుంచి తెప్పిస్తున్నందున రవాణా ఖర్చు రూ.1,000, నాటినందుకు కూలి రూ.5,000, బలం మందులకు సుమారు రూ.10 వేలు, పండిన పంట అంటే ఆకులను తాడుకు గుచ్చినందుకు కూలి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు అవుతుంది. మొత్తం మీద ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు అవుతుంది. నీట్ల నాలుగు, ఐదు తడులు పెట్టుకుంటే సరిపోతుంది. బెట్ట పరిస్థితుల్లోనూ పంట పండే అవకాశాలున్నాయి.

రూ.లక్ష వరకు రాబడి

ముందుగానే రైతులు ఇండియన్ టుబాకో కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం క్వింటా పొగాకుకు ప్రస్తుత మార్కెట్ ధర రూ.15 వేలు ఉంది. ఎకరాకు సుమారు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు పొగాకు పండుతుంది. ఈ ప్రకారం ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు రాబడి ఉంది. ఇందులో పెట్టుబడి రూ.60 వేలు పోను రూ.లక్ష వరకు రాబడి పొందే అవకాశాలుంటాయని రైతులు చెబుతున్నారు. పండిన పంటను కూడా ఐటీసీ వారే కొనుగోలు చేస్తారు. రవాణా ఖర్చులు కూడా ఐటీసీ వారే భరిస్తారు.

ఏటా ఉంటుందన్న నమ్మకం లేదు



నేను ఖరీఫ్లో పత్తి పంట వేసి తీవ్రంగా నష్టపోయా, గత ఆగస్టు, సెప్టెంబర్లో మిర్చి వేశా. తెగుళ్లతో దిగుబడి తగ్గింది. ధర కూడా లేదు. ఇక చేసేది లేక రబీ పంటగా నాకున్న 1.25 ఎకరాలలో పొగాకు వేశా. సుమారు రూ.50 వేల నుంచి 60 వేల వరకు పెట్టుబడి పెట్టా. పంట బాగానే ఉంది. ఆకు కూడా వెడల్పుగా, పొడవుగా పెరిగింది. ఐటీసీ వాళ్లే కొనుగోలు చేస్తామన్నారు. ప్రస్తుత మార్కెట్ ధర రూ.15 వేలు ఉంది. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశాలున్నాయి. పత్తి, మిర్చి పంటలకన్నా పరవాలేదు. అయితే ఈ పంట ప్రతి ఏటా ఉంటుందన్న నమ్మకం లేదు.

– నుంకర శ్రీనివాసరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

పంట మార్పిడి విధానాన్ని పాటించాలి



వేసిన పంటనే ప్రతి ఏటా వేసుకోవడం వల్ల ఆశించిన విధంగా దిగుబడులు రావు. పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి. మండలంలో సుమారు 700కు పైగా ఎకరాలలో పొగాకు వేసినట్లు ప్రాథమిక అంచనా. ఐటీసీ వాళ్లే కొనుగోలు చేసే విధంగా రైతులు ఒప్పందం చేసుకున్నారు. అయితే ఈ పరిస్థితులు ప్రతి ఏటా ఉంటాయా అన్నదే అనుమానం. ఏదైనా పంట మార్పిడి విధానం సత్ఫలితాలనిస్తుంది.

– పి.వెంకటేశ్వర్లు, ఏవో, అచ్చంపేట

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రాజుపాలెం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్సీ హెల్త్ సూపర్వైజర్ జీవన్రావు తెలిపారు. మండలంలోని చౌటపాపాయపాలెంలో ఫ్రై డే – డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరిగి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని తెలిపారు. ఇళ్లలోని పాత టైర్లు, కొబ్బరి బొండాలను తొలగించాలని సూచించారు. మురికి నీరు నిల్వ ఉండడం వలన మలేరియా, డెంగీ, డయేరియా మొదలగు వ్యాధులు వస్తాయని, అందువలన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాలు, సైడు కాలువల్లో బ్లీచింగ్, కిరోసిన్ చల్లినట్లయితే దోమల లార్వాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్హెచ్పీ హన్మాకుమారి, ఏఎన్ఎం ప్రమీలారాణి, ఆశా కార్యకర్తలు రెబ్బమ్మ, మద్దెమ్మ, ఈశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛాంధ్రపై దృష్టి సారించాలి

పిడుగురాళ్ల: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు దృష్టిసారించాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ శానిటేషన్ సెక్రటరీలకు ఈ కార్యక్రమంపై సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రతి మూడవ శనివారం పట్టణంలోని 33 వార్డుల్లో పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అందించే సేవల ద్వారానే మన్ననలు

సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి



కమిషనర్ కొలిమి షమ్మిని సత్కరిస్తున్న ఉద్యోగులు

సత్తెనపల్లి: విధి నిర్వహణలో ప్రజలకు అందించే సేవల ద్వారానే వారి నుంచి మన్ననలు పొందగలుగుతామని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్గా విధులు నిర్వహిస్తూ గ్రేడ్–2 కమిషనర్గా పదోన్నతి పొంది విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్గా బదిలీపై వెళుతున్న సందర్భంగా మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్, సచివాలయ, మెప్మా ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం షమ్మికి వీడ్కోలు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి చనిపోయే వృద్ధుల వరకు ప్రజలకు మున్సిపల్ సేవలు అందుతాయన్నారు. బాధ్యతయుతమైన మన సేవల ప్రజలకు అన్ని విధాలా ఉపయోగపడాలన్నారు. ఎవరికైనా ఇబ్బంది, సమస్య ఉంటేనే మన వద్దకు వస్తారని, వారు చెప్పే సమస్యను ప్రతి ఉద్యోగి ఓర్పు, సహనంతో శ్రద్ధగా ఆలకించినట్లయితే 50 శాతం సంతృప్తి చెందుతారన్నారు. ఆ సమస్యను పరిష్కరిస్తే 100 శాతం సంతృప్తి చెంది పది మందికి తెలియజేస్తారన్నారు. సమస్యతో వచ్చిన వారి పట్ల విసుగు చెందడం, పని ఒత్తిడి కారణంగా అటు ప్రజలపై, అటు కుటుంబంపై కోపాన్ని చూపితే నష్టపోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో సత్తెనపల్లి పురపాలక సంఘం ఈ స్థాయిలో ఉండటానికి ప్రతి ఒక్క ఉద్యోగి సహకారం వల్లనే జరిగిందన్నారు. ఎలాంటి ఒత్తిళ్లు లేకపోవటంతో ఐదేళ్ల ప్రజలకు సేవ చేసే అవకాశం కలిగిందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ షమ్మి దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. తనపై అభిమానంతో సత్కరించి వీడ్కోలు పలుకుతున్న ప్రతి ఒక్కరికి ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, గుంటూరు కార్పొరేషన్ డీఈ మధుసూదన్రావు, మున్సిపల్ డీఈ తోట వెంకటరమణ, ఏఈ సాగర్, శానిటరీ ఇన్స్పెక్టర్ సారధి, టీపీఓ రాధాకృష్ణ, ఇన్ఛార్జ్ ఆర్ఓ సుభానీ, ఆర్ఐ పీటర్బాబు, సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెపోగు శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ, మెప్మా ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

చర్చి వార్షికోత్సవ ప్రత్యేక ప్రార్థనలు

మాచర్ల: పట్టణంలోని సాయిటీ కాలనీ వెనుక, కేవీఆర్ గార్డెన్స్ సమీపంలో లయోలా ఇవాంజిలికల్ ఫెలోషిప్ 7వ వార్షికోత్సవ సువార్త సభలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఏసు ప్రభువు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలను సంఘ పెద్దలు నిర్వహించారు. పలువురు చర్చి పాస్టర్లు బోధనలు చేశారు. అనంతరం ప్రేమ విందు నిర్వహించారు. శనివారం ముగింపు వార్షికోత్సవంలో భాగంగా పలు ప్రాంతాల నుంచి చర్చి పాస్టర్లు, పలువురు పాల్గొని ప్రత్యేక బోధనలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని చర్చి నిర్వాహకులు, పాస్టర్లు కోరారు.

నేడు హజరత్ సుభాని దర్గా ఉరుసు మహోత్సవం



నాదెండ్ల: అప్పాపురం గ్రామంలో కొలువై యున్న హజరత్ మహబూబ్ సుభాని బాబా దర్గా 18వ ఉరుసు మహోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఉదయం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరపనున్నారు. దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం గంధమహోత్సవం, సాయంత్రం సుమారు 20 వేల మందికి భారీ అన్నదానం చేయనున్నారు. దర్గాను విద్యుత్దీపాలతో అలంకరించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

మాచర్ల: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం బయట ఓ వ్యక్తి మృతి చెందడంతో...ఆ అనాథ శవానికి స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మెట్టు గోవిందరెడ్డి శుక్రవారం మున్సిపాలిటీ సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. 50 ఏళ్ల ఉన్న ఆ పురుషుడి శవాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారమందించారు. గత ఐదు రోజులుగా వివిధ రకాలుగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరూ ఆచూకీ కోసం ముందుకు రాకపోవడంతో అంత్యక్రియలు జరిపారు.

ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ ఫాం పాండ్స్ ఏర్పాటు చేయాలి

డ్వామా పీడీ ఎం.సిద్ధమూర్తి



మాట్లాడుతున్న డ్వామా పీడీ సిద్ధమూర్తి

క్రోసూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా ఈ నెలాఖరులోగా ఫాం పాండ్స్ ఏర్పాటు చేయాలని డ్వామా పీడీ ఎం.సిద్ధమూర్తి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.6 కోట్ల పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. ప్రజావేదికకు ముఖ్య అతిథిగా డ్వామా పీడీ సిద్ధమూర్తి హాజరవ్వగా, ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల నివేదికలను డీఆర్పీలు చదివారు. 26 అంశాల నివేదికలో ఎక్కువ శాతం ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్ రిపోర్టులు సరిగా నిర్వహించకపోవటం, సంతకాలు, వేలిముద్రలు లేకుండా వేతన చెల్లింపులు, 100 రోజుల పనులు చూపించకపోవటం, ప్రీ మెజర్మెంట్స్, రికార్డ్స్ అప్డేట్ చేపట్టకపోవటం లాంటివి గుర్తించారు. దీనిపై పీడీ హెచ్చరిస్తూ సక్రమంగా వేతనాల చెల్లింపులు చేపట్టకుంటే ఆ వేతనం నగదు రికవరీ చేయాల్సివస్తుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు కంప్యూటర్ ఆపరేటర్లను పనుల సక్రమంగా చేయాలని హెచ్చరించారు. ఫాం పాండ్స్ మస్టర్ ఈ నెలాఖరు కల్లా తప్పనిసరిగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ కేవీ నారాయణ, ఎస్పార్పీ జెఎం రాజు, డీఆర్పీలు, ఏపీఓ వెంకటేశ్వరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

గురజాల: ట్రెజరీ పరిధిలోని పెన్షనర్లకు శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు చిట్టెం వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉదయం 8 గంటలకు నరసరావుపేట రామలింగారెడ్డి కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి హెల్త్ కార్డుపై ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తెలిపారు.

సుబాబుల్ వ్యాపారిపై టీడీపీ నేతల దౌర్జన్యం



నాదెండ్ల: ఎండుగుంపాలెం గ్రామంలో సుబాబుల్ వ్యాపారం చేసుకునే వ్యక్తిపై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. గ్రామానికి చెందిన మొక్కపాటి శ్రీనివాసరావు వ్యవసాయంతో పాటూ పేపర్లో సుబాబుల్ తోటలు కొనుగోలు చేసి మార్కెటింగ్ చేస్తుంటారు. నెల క్రితం కొన్ని తోటలు కొట్టి సుమారు వంద టన్నులకు పైగా కర్రను గ్రామ వెలుపల పొలాల్లో, రోడ్డు పక్కన నిల్వ ఉంచారు. అయితే కర్రను లోడింగ్ చేసేందుకు ఒప్పుకునేది లేదంటూ టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. నువ్వు వైఎస్సార్సీపీ సానుభూతిపరుడని, నిన్ను వ్యాపారం చేసుకోనివ్వమంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. అంతేకాక లారీ యజమానులు, హమాలీలకు ఫోన్ చేసి ఎండుగుంపాలెం గ్రామానికి రావొద్దంటూ హెచ్చరించారు. దీంతో శ్రీనివాసరావు గ్రామంలోని పలువురు టీడీపీ నాయకులను సంప్రదించి బ్రతిమాలుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

న్యాయవాద చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

సత్తెనపల్లి: న్యాయవాద చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్కుమార్ అన్నారు. న్యాయవాద చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ రెండవ రోజు ఉమ్మడి గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించి తాలూకా న్యాయస్థానంలో ఉన్న న్యాయదేవత విగ్రహం వద్ద శుక్రవారం నినాదాలు చేసి నిరసన తెలిపారు. న్యాయవాదుల చట్టం–1960, సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బి.ఎల్.చిన్నయ్య, కట్టం వీరభాస్కరరెడ్డి, కొల్లా వెంకటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయకుమార్, కె.ఎస్.వి.హరిబాబు, చావా బాబూరావు, ఎం.ఏడుకొండలు, షేక్ నాగూర్, గుజ్జర్లపూడి సురేష్, మదనమోహన్, గుర్రం పవన్ కుమార్, బాదినేడి శ్రీనివాసరావు, చావా నాగరాజు, ఉడుముల వెంగళరెడ్డి, ఏసురత్నం, భవ్య, బయ్యవరపు నరసింహారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మాతృభాష పరిరక్షణకు అందరు కృషి చేయాలి



మాట్లాడుతున్న హెచ్ఎం కె.వి.రమణ



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

హెచ్ఎం కె.వి.రమణ

పెదకూరపాడు: మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పెదకూరపాడు జెడ్పీ పాఠశాల హెచ్ఎం కె.వి.రమణ అన్నారు. శుక్రవారం పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభాష అభివృద్ధికి కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు, దేశయిన శాస్త్రవేత్త శాంతి స్వరూప్ భట్నాగర్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ యునెస్కో పిలుపు మేరకు ప్రతి ఏడాది ఫిబ్రవరి 21న మాతృభాష దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఇంగ్లిషు భాషతో పాటు విద్యార్థులు మాతృభాషపై మక్కువ చూపాలన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

పెదకూరపాడు : మాతృభాష దినోత్సవం సందర్భంగా మండలంలోని గారపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాతృభాషపై వ్యాసరచన, డిబేట్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాగులూరి ఫౌండేషన్ అధినేత భాను ప్రకాష్ మాట్లాడుతూ మాతృభాషను ప్రతి ఒక్కరూ ప్రేమించాలని, ఇతర భాషలను కూడా గౌరవించాలని తెలిపారు. మాతృభాష ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణారావు, కిరణ్ కుమార్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

పిడుగురాళ్ల: ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇళ్ల నిర్మాణాల దశలను వెంటనే గుర్తించాలని, వివరాలను సమాచారాన్ని సేకరించాలన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బంగారయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

గురజాల రూరల్: సైబర్ నేరాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సీఐ అవుల భాస్కర్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మంచి విద్యనభ్యసించి మెరుగైన ఉద్యోగాలు పొందాలన్నారు. ఎస్ఐ వై.వినోద్ కుమార్, ప్రిన్సిపాల్ నాయక్ తదితరులున్నారు.

బైకు అదుపుతప్పి ఒకరికి గాయాలు

నూజెండ్ల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని ముప్పరాజువారిపాలెం గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల మేరకు నూజెండ్ల గ్రామానికి చెందిన ఏసోబు స్వగ్రామం నుంచి ఉప్పలపాడు గ్రామానికి వెళుతుండగా ముప్పరాజువారిపాలెం కాల్వ కట్ట సమీపంలో అదుపు తప్పి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వటంతో క్షతగాత్రుడిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.